క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్య మైక్రోక్యాపిటల్ లిమిటెడ్ నందు ఫీల్డ్ స్టాఫ్ కోసం ఎంపిక ఉంటుందన్నారు. సుమారు 100 ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా ఆలేడ్‌లో వన మహోత్సవం



ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

దుద్యాల్: వన మహోత్సవ కార్యక్రమం మండలంలోని ఆలేడ్ గ్రామ చెరువు కట్టపై కొడంగల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ సిబ్బందితో కలిసి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి వృక్షాలను రక్షించే విధానంపై గ్రామస్తులకు కల్పించారు. చెరువు కట్టలపై ఈత చెట్లు నాటడం వల్ల గౌడన్నలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాములు, పంచాయతీ కార్యదర్శి రమేశ్, టీఏ శ్రీనివాస్, ఎఫ్ఏ వెంకటేశ్ గ్రామస్తులు వెంకటయ్య గౌడ్, నర్సింలు గౌడ్, అనంతయ్య, శ్రీధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వనమహోత్సవానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

అనంతగిరి: వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని భృంగీ కాలనీలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థల నిర్ధారణ చేసి గుంతలు తీసి 250 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పేదలపాలిట వరం సీఎంఆర్‌ఎఫ్



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు టౌన్ : సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిపూర్‌కు చెందిన నమృతకు మంగళవారం రూ. 2.5 లక్షల ఎల్‌ఓసీని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదలకు కార్పొరేట్ తరహాలో వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎల్లవేళలా అండగా నిలుస్తుందన్నారు.

ఎంపీఓగా బాధ్యతల స్వీకరణ

బంట్వారం: మండలానికి బదిలీపై వచ్చిన నాగరాజు ఎంపీఓ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విజయ్ కుమార్ నవాబుపేటకు వెళ్లగా, వికారాబాద్ మండలంలో పని చేసిన నాగరాజు బంట్వారం ఎంపీఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. అలాగే, యాలాల నుంచి బదిలీపై వచ్చిన రాధిక జూనియర్ అసిస్టెంటుగా బాధ్యతలు స్వీకరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

మర్పల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ రాజమల్లయ్య పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని బిల్కల్, దార్లపల్లి, పట్లూర్ కేంద్రాలను సందర్శించి, సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ భవనాల పరిస్థితిని తెలుసుకుని నివేదిక పంపిస్తామని చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మొక్కలు నాటాలని కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు.

‘పంచాయతీ’ హామీ ఉత్తిదే!

- మండలంలో 3 కొత్త జీపీల ఏర్పాటు
- 2023లో బీఆర్‌ఎస్ అధికారిక ప్రకటన
- నేటికి విడుదల కానీ గెజిట్
- ఆందోళన బాటలో అనుబంధ గ్రామాలు
- నిరాహార దీక్షకు దిగిన మల్కన్‌గిరి గ్రామస్తులు

బషీరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో 500 జనాభా కలిగిన గ్రామాలు, తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా చేసింది. అయితే, అక్కడక్కడా మిగిలిపోయిన 234 అనుబంధ గ్రామాలను సైతం 2023 ఫిబ్రవరిలో పంచాయతీలుగా మారుస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇందులో భాగంగా తాండూరు నియోజకవర్గంలోనూ 12 కొత్త పంచాయతీలు ఏర్పాటు కాగా, అందులో బషీరాబాద్ నుంచి మూడు గ్రామాలను జీపీలుగా అధికారులు ప్రకటించారు. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అప్పటి ఎమ్మెల్యేకు గ్రామాల్లో ఘనంగా సన్మానాలు చేశారు. ఎన్నికల్లోనూ దీనిని బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారంగా వాడుకుంది. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయి ..కాంగ్రెస్ సర్కారు కొలువుతీరిన విషయం తెలిసిందే. అయితే, ఈ మధ్యే మల్కన్‌గిరి గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది రవికుమార్, మరికొందరు గ్రామస్తులు పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను కలిసి కొత్తజీపీల గురించి ప్రస్తావించారు. 2023 ఫిబ్రవరిలో కొత్త పంచాయతీలపై ఎలాంటి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కాలేదని మంత్రి వారికి తేల్చిచెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటనలు చేసి ప్రజలను అన్ని విధాల మభ్యపెట్టిందని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు. మరోవైపు అనుబంధ గ్రామాల ప్రజలు జీపీలుగా ప్రకటించాలని మళ్లీ ఆందోళన బాట పట్టారు.



మల్కన్‌గిరి గ్రామం

నిరాహారదీక్షకు దిగిన మల్కన్‌గిరి ప్రజలు



రిలే నిరాహార దీక్షకు దిగిన మల్కన్‌గిరి గ్రామస్తులు

మండలంలోని కాశీంపూర్ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న మల్కన్‌గిరి గ్రామస్తులు మంగళవారం రిలే నిరాహార దీక్షకు దిగారు. మా గ్రామంలో 600 జనాభా ఉన్నప్పటికీ ఎందుకు జీపీగా ప్రకటించలేదని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వారం రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేసినట్లు చెప్పారు. అప్పట్లో ప్రభుత్వం మల్కన్‌గిరిని జీపీగా ప్రకటించిందని గుర్తు చేశారు. తీరా ఇప్పుడు గెజిట్ వెలువడలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని జీపీగా మార్చేవరకు దీక్షలు కొనసాగిస్తామని గ్రామస్తులు ప్రకటించారు. మరోవైపు మిగతా అనుబంధ గ్రామాల ప్రజలు కూడా నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు.

‘నిషేధిత’ భూ సమస్యలు పరిష్కరించండి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల పరిధిలో ఉన్న నిషేధిత భూముల సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసు చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ధరణి పోర్టల్ నమోదులో కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన పొరపాట్ల కారణంగా కొందరి భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లాయని, అలాగే, పట్టా ఉండి, కొద్ది మొత్తంలో అసైన్డ్ భూములు ఉండటం వల్ల సమస్యగా మారిందని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు అవగాహన లేక భూముల విషయంలో ఘర్షణలకు పాల్పడుతున్నారని వివరించారు. కావునా, రెవెన్యూ పరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. స్పందించిన అధికారులు విడతల వారీగా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో యాదయ్య, సలీం, వెంకటయ్యగౌడ్, శేఖర్, వెంకట్, యాదయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బడికి వెళ్లాలంటే బురదనీటిలోనే..

ఇబ్బందులు పడుతున్న ప్రజలు, విద్యార్థులు

పెద్దేముల్: వరుస వర్షాలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, దినసరి కూలీలు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మంగళవారం మండలంలోని జనగాం గ్రామంలో రోడ్లపై వర్షం నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఉదయం, సాయంత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడికి వెళ్లాలంటే బురదనీటిలో నడవాల్సిందేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రత్యేకాధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వీధిలైట్లు, మురుగునీటి కాల్వలు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేకాధికారులు స్పందించి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్లపై మడుగులా చేరిన వర్షం నీరు

మొక్కలు నాటడం బాధ్యత

ఎంపీడీఓ రామకృష్ణ



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ రామకృష్ణ, సిబ్బంది

కుల్కచర్ల: మొక్కలు నాటడాన్ని ప్రజలు బాధ్యతగా భావించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పీరంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో మొక్కలు నాటడంతో పాటుగా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఖాళీ స్థలం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలలో మొక్కలు నాటాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంజీవ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వం నమోదు



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

ధారూరు: మండల పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొని మండలంలోని నాగసమందర్, మున్నూరుసోమారం, అవుసుపల్లి, కుక్కింద, గడ్డమీది గంగారం, ధర్మాపూర్, కాచారం, రుద్రారం తదితర పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం సేకరించారు. కార్యక్రజుమంలో మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, రాష్ట్ర బాధ్యులు రవీందర్‌రెడ్డి, నాయకులు సుదర్శన్, సుధాకర్ పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

మోమిన్‌పేట: మండలంలోని మొరంగపల్లి గ్రామంలో లక్ష్మీనర్సింహ్మస్వామి దేవస్థానానికి చెందిన గోమాత మృతి చెందింది. దీంతో మంగళవారం భక్తుల భజనలు, డప్పుల వాయిద్యాల మధ్య ట్రాక్టరులో ఊరేగింపుగా గ్రామ శివాలయం ఆవరణలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాణయ్య, యువజన సంఘ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

సీఐ సంతోష్‌కుమార్



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ సంతోష్‌కుమార్

తాండూరు రూరల్: చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని పట్టణ సీఐ సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఇరువర్గాల మధ్య కొంతకాలంగా భూమి విషయమై గొడవలు జరుగుతున్నాయి. తహసీల్దార్, కలెక్టర్, హైకోర్టుతో పాటు సీఐ, డీఎస్పీ, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరువర్గాల వాదనతో పాటు ప్రజల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో అందరూ కలిసిమెలసి ఉండాలని సూచించారు. భూతగదాలతో గొడవలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు. ఏదైనా సమస్యలు ఉంటే గ్రామ పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పారు.

అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి



నమూనాలను ప్రదర్శిస్తున్న దేవి, విద్యార్థులు

కుల్కచర్ల: ప్రత్యక్షంగా విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధన చేయాలని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎఫ్‌ఎల్‌ఎన్(ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమెరసీ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా లభించే వనరులతో వివిధ నమూనాలను విద్యార్థులు తయారు చేయడం ద్వారా వారికి చాలా కాలం గుర్తుండి పోతుందన్నారు. ఈ విధానం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. పరీక్షల్లో ఇది ఉపయుక్తంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏ లోకి మార్చండి

కుల్కచర్ల: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని మండల ముదిరాజ్ సంఘం నాయకులు గాదె మైపాల్ ముదిరాజ్, అనంతయ్య ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో అధికంగా ఉన్న ముదిరాజ్‌లు నిరుపేద పరిస్థితులు అనుభవిస్తున్నారని వాపోయారు. ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వాలు నాన్చుతూ ముదిరాజ్‌లను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణనను నిర్వహించి ముదిరాజ్‌లకు ప్రత్యేక నిధులు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి, ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో భీమయ్య, కాటనిపల్లి మైపాల్, కొండ ఆంజనేయులు, లాలు, రాజు, చెన్నయ్య, శ్రీశైలం, మహేందర్, అంజిలయ్య, లక్ష్మయ్య, శివయ్య, నర్సింలు, రమేష్, చందు, వెంకటేష్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాక్ కొడుతున్న విద్యుత్ స్తంభం

దుద్యాల్ : గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లోని పాత విద్యుత్ ఇనుప స్తంభాలకు షాక్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందులో భాగంగానే మండలంలోని హస్నాబాద్ గ్రామంలో 4వ వార్డులోని బండారి నర్సింలు ఇంటి దగ్గర ఉన్న ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతున్నట్లు కాలనీవాసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న లైన్‌మెన్ వెంకట్రాములు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదం సంభవించేంత షాక్ రావడం లేదన్నారు. వర్షాల కారణంగా స్తంభం నానడంతో స్వల్పంగా షాక్ వస్తుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులు విన్నవించారు.



స్తంభాన్ని పరిశీలిస్తున్న కాలనీవాసులు

కఠిన చర్యలు తీసుకోవాలి

అనంతగిరి: సోషల్ మీడియాలో వేంకటేశ్వర స్వామి, సుప్రభాతం గురించి కించపరిచినట్లుగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి సతీష్, సీనియర్ నాయకులు పాండుగౌడ్, అమర్, తదితరులు ఉన్నారు.



ఎస్‌ఐకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న నాయకులు

తెలంగాణకు మరోసారి మొండిచేయి

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి

ధారూరు: కేంద్రం తెలంగాణకు మరోసారి మొండి చేయి చూపించిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి పటోళ్ల రఘువీరారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తమ మిత్రపక్షాలకు చెందిన రాష్ట్రాలకు మాత్రమే అధిక నిధులు కేటాయింపు చేసి.. తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చిందని అసహనం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి తన కుర్చీని కాపాడుకునేందుకే బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లుందని పేర్కొన్నారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు ఇస్తే తెలంగాణకు గుండుసున్నా చూపిందన్నారు. కనీసం తెలంగాణకు వరప్రదాయని అయిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎలాంటి నిధులు కేటాయించలేదని, ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో పాపర్టీట్యాక్స్ 12.5 శాతం పెంచడంపై సామాన్యులపై పెను ప్రభావం చూపుతుందన్నారు. సామాన్యులు ఇల్లు లేదా ప్లాట్‌ను అమ్ముకుంటే 12.5 శాతం ప్రభుత్వానికి ట్యాక్సు కట్టడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించడం సిగ్గుచేటని ఆరోపించారు. బీజేపీ దివాలకోరుతనానికి నిదర్శనమన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



నెత్తిన బోనాలతో మహిళలు

తాండూరు టౌన్ : పాత తాండూరులోని మైసమ్మ గుడి బోనాలు మంగళవారం ఘనంగా జరిగాయి. డప్పుల చప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగాఎల్లమ్మ బోనాల జాతర

తాండూరు టౌన్ : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణం ఇందిరానగర్‌లోని రేణుకా ఎల్లమ్మ బోనాల జాతర మంగళవారం వైభవంగా జరిగింది. డప్పుల చప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా పల్లెబాయి మైసమ్మ బోనాలు

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామ శివారులో పల్గురాళ్ల తండా సమీపంలో వెలసిన పల్లెబాయి మైసమ్మ బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, చేపల వలలతో తయారు చేసిన ప్రత్యేక అలంకరణ, డప్పుల చప్పుళ్లతో ఆటలు ఆడుతూ విన్యాసాలు చేశారు.



దుద్యాల్: చేపల వలలతో చేసిన అలంకరణతో పోతరాజుల విన్యాసాలు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు



కొడంగల్ రూరల్ : ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని సన్‌సిటీ కాలనీలో మంగళవారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. కాలనీవాసులు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలతో నైవేద్యాలను సమర్పించారు. ప్రదక్షిణలు చేస్తూ తమను చల్లంగా చూడాలని కోరుకున్నారు.

నిర్ణయించిన ధరలకే సేవలు

మర్పల్లి : మీసేవా కేంద్రాల్లో నిర్ణయించిన ధరలకే ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారిణి జయసుధ అన్నారు. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నవాబుపేట ఎంపీడీఓ అనురాధతో కలిసి మర్పల్లి మండల మీ సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్ణయించిన ధరకే డబ్బులు తీసుకోవాలని, ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెంటర్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, సర్టిఫికెట్లను కూడా నిర్ణీత సమయంలో అందించాలని సూచించారు.



మీసేవాను తనిఖీ చేసిన అధికారి జయసుధ